సాక్షి రంగారెడ్డి

బుధవారం । 28 । జూన్ । 2023



ముంపు ముప్పు తప్పదా?

వానాకాలం వచ్చిందంటే ముంపు గ్రామాల ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఏ ఆపద వస్తుందోనని జంకుతున్నారు. 8లో▸



పశువైద్యం దైవాదీనం

పశువైద్యం దైవాదీనంగా మారింది. దీంతో పశుపోషకులు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలి

ఐసీడీఎస్‌కు బడ్జెట్‌ను పెంచాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న తదితరులు డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్‌తోనే ఆలయాలకు ఆధ్యాత్మిక శోభ

- దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

చిలకలగూడ: తెలంగాణలోని ఆలయాలకు ఆధ్యాత్మిక శోభను చేకూర్చిన ఘనత సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్‌కే దక్కుతుందని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీర్ణోద్ధరణ ఆలయాల అభివృద్ధికి నిధుల కేటాయింపు, అర్చకులకు వేతనాలు, ధూప దీప నైవేద్యం వంటి పథకాలను ప్రవేశపెట్టి ఆధ్యాత్మిక తెలంగాణను సీఎం కేసీఆర్ ఆవిష్కరించారని కొనియాడారు. శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులు, స్థానిక కార్పొరేటర్ సామల హేమలతతో కలిసి బాలాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రాజేష్‌కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వేణుగోపాలరావు, పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, కేజీ నారాయణన్, బాలభాస్కర్, శివశంకరన్, సుజయ్ ప్రకాశ్, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

బండ్లగూడ ఫ్లాట్లకు భారీ డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: నాగోల్ బండ్లగూడ రాజీవ్ స్వగృహ (సహ భావన టౌన్‌షిప్)లో మిగిలిన ఫ్లాట్‌ల కొనుగోలుకు బిడ్డర్‌లు పోటీపడ్డారు. సోమవారం జరిగిన బహిరంగ వేలంలో 7 ట్రిపుల్ బెడ్రూం (డీలక్స్) ఫ్లాట్లకు 86 మంది బిడ్డర్లు, 6 ట్రిపుల్ బెడ్రూం ఫ్లాట్లకు 108 మంది బిడ్డర్‌లు పోటీ పడగా, మరో 21 డబుల్ బెడ్రూం ఫ్లాట్లకు 167 మంది బిడ్డర్‌లు ఓపెన్ యాక్షన్‌లో పాల్గొన్నట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. మొత్తం 34 ఫ్లాట్లను బిడ్డర్‌లు కొనుగోలు చేశారు. మరో 226 సింగిల్ బెడ్రూం ఫ్లాట్‌లకు అధికారులు మంగళవారం వేలం నిర్వహించారు. ఈ నెల 30వ తేదీ శుక్రవారం వరకు వరుసగా 4 రోజుల పాటు ఈ వేలం కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో లాటరీ ప్రాతిపదికన బండ్లగూడ ఫ్లాట్ల అమ్మకాలకు వచ్చిన రేటు కంటే ఈసారి బిడ్డింగ్ ద్వారా ఎక్కువ ధరకు అమ్ముడైనట్లు అధికారులు పేర్కొన్నారు.

పాతబస్తీ బోనాలపై మంత్రి సమీక్ష నేడు

చార్మినార్: పాతబస్తీలో ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 28న సాలార్‌జంగ్ మ్యూజియం ఆడిటోరియం హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ సమావేశం ఈ నెల 26న నిర్వహించుండగా... అనివార్య కారణాలతో వాయిదా పడి 28న నిర్వహించనున్నారు. బోనాల జాతర ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులతో పాటు పాతబస్తీలోని బోనాల జాతర ఉత్సవాల నిర్వాహకులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు పాతబస్తీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఏయే అభివృద్ధి పనులు ఎక్కడెక్కడ నిర్వహించనున్నారే అనే అంశాలపై చర్చించనున్నారు.

లాభాల బాటలో ఆర్టీసీ

- మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

అఫ్జల్‌గంజ్: ప్రజల ఆకాంక్షల మేరకు ఆర్టీసీని ఆధునికీకరిస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మహాత్మా గాంధీ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పీకల్లోతు నష్టాల్లో ఉన్న ఆర్టీసీని సీఎం కేసీఆర్ నేతృత్వంలో లాభాల బాట పట్టిస్తున్నామన్నారు. ఆర్టీసీలో పని చేసే ప్రతి ఒక్కరికి రావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ప్రజలను ఆర్టీసీ వైపు మళ్లించేందుకు ఎన్నో ప్రయోగాత్మక నిర్ణయాలు తీసుకుంటూ కొత్త పథకాలు తీసుకు వస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే ఆర్టీసీ కార్గో సర్వీసులు, మహిళలకు, వయోవృద్ధులకు డిస్కౌంట్ టికెట్ వంటి అనేక ఆఫర్లు అందజేస్తున్నామని మంత్రి స్పష్టంచేశారు.

పఠన పథం

చదవడం, రాయడంతో పాటు విద్యార్థుల్లోని నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది విద్యాశాఖ. బట్టీ విధానానికి స్వస్తి చెబుతూ.. విద్యా సామర్థ్యాల పెంపునకు కృషిచేస్తోంది.

- రీడింగ్, రైటింగ్ స్కిల్స్ పెంపునకు విద్యాశాఖ కృషి
- ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న పఠనోత్సవం
- ప్రతీ విద్యార్థి చదివేలా ప్రత్యేక కార్యాచరణ



దూసకల్ ప్రాథమిక పాఠశాలలో రీడ్ కార్యక్రమం

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా బోధన కోసం విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోంది. చదవడం, రాయడంతో పాటు పోటీతత్వాన్ని పెంపొందించే దిశగా పఠనోత్సవానికి బీజం వేసింది.

అన్ని స్కూళ్లలో..

ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న వారిలో రీడింగ్ స్కిల్స్ పెంపొందించడంపై విద్యాశాఖ అధికారులు దృష్టిసారించారు. మాతృభాష, గణితం, ఆంగ్లంలో కనీస సామర్థ్యాల సాధన కోసం రీడింగ్ క్యాంపెయిన్‌ను చేపట్టారు. విద్యార్థుల ఆలోచనలు, భావ వ్యక్తీకరణకు బాటలు వేసేలా దీన్ని రూపొందించారు. నిత్యం కొనసాగే రెగ్యులర్ తరగతులకు ఆటంకం కలగకుండా పాఠ్యాంశాలు బోధిస్తూ.. కథల పుస్తకాలు, వార్తా పత్రికలు, పాఠ్యేతర పుస్తకాలు, పాఠ్యాంశాలకు సంబంధించిన బుక్స్ బాగా చదవగలిగేలా శిక్షణ ఇవ్వడమే దీని ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 26న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూలై 31 వరకు కొనసాగనుంది.

గతంకన్నా భిన్నంగా

విద్యార్థుల పఠనా సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం గతంలో అనేక కార్యక్రమాలు చేపట్టింది. 2019– 20లో 'మూలాల్లోకి వెళుదాం' అనే పేరుతో ఏబీసీ (అటైన్‌మెంట్ ఆఫ్ బేసిక్ కాంపిటెన్సీ) నిర్వహించగా.. ఈఏడాది పఠనోత్సవం (రీడింగ్ క్యాంపెయిన్)ను నిర్వహిస్తోంది. గతానికి భిన్నంగా ఈసారి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.

పఠనోత్సవంలోని అంశాలు

- ప్రతి రోజు పుస్తక పఠనం కోసం ఒక పీరియడ్ కేటాయిస్తారు.
- ప్రతి పీరియడ్‌లో ఉపాధ్యాయుడు తన సబ్జెక్టుకు సంబంధించిన అంశాన్ని పది నిమిషాల పాటు విద్యార్థులతో చదివించాలి.
- గ్రంథాలయంలో నిత్యం కథల పుస్తకాలు చదివించడం.

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు:	886
ప్రాథమికోన్నత:	178
ఉన్నత:	244
విద్యార్థులు:	1,41,214 మంది

- మూడు రోజులు మాతృభాషలో మిగితా మూడు రోజులు ఆంగ్లభాషలో కథల పుస్తకాలు చదివిస్తారు.
- లైబ్రరీ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా బుక్స్ ఎంపిక చేసుకుని చదివేలా ప్రోత్సహించాలి.
- విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు, మ్యాగజైన్లను లైబ్రరీల నుంచి ఇంటికి తీసుకెళ్లే వెసులుబాటు కల్పించడం.
- ప్రతిరోజూ ప్రార్థన సమయంలో పుస్తకాలు చదివించడం.
- వీటిని వీడియో తీసి స్కూల్ గ్రూప్‌లలో షేర్ చేయాలి. జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు పంపించాలి.
- తల్లిదండ్రుల సమావేశంలోనూ విద్యార్థులతో పుస్తక పఠనం చేయించాలి.
- క్రమం తప్పకుండా వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలి. అన్ని స్కూళ్లలో జూలై 10 నుంచి 15 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించాలి
- ప్రముఖులు, తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చినప్పుడు గ్రంథాలయంలోని కథల పుస్తకాలను చదివించాలి.
- తమ సబ్జెక్టుకు సంబంధించి తరగతిలో ఎంత మంది బాగా చదువుతున్నారు..? ఎందరు నెమ్మదిగా చదువుతున్నారు..? ఎంత మందికి చదవడం, రాయడం వంటి కనీస సామర్థ్యాలు లేవు..? అనే విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి.
- ఈవివరాలను హెచ్ఎంలు, ఎంఈఓలు, నోడల్ అధికారులకు తెలియజేయాలి.



రీడింగ్‌పై అవగాహన కల్పించేలా బోర్డుపై ఏర్పాటు చేసిన చిత్రాలు

పకడ్బందీగా అమలు

రీడ్ కార్యక్రమంతో విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరుగుతుంది. వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పకడ్బందీగా అమలు చేస్తున్నాం
– సర్వరాజ్ అన్వర్, హెచ్ఎం, దూసకల్, ఫరూఖ్‌నగర్ మండలం

ఎంతో ఉపయోగం

విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంపొందించడానికి రీడ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. 1నుంచి 10 తరగతుల విద్యార్థులకు వంద రోజుల పాటు ఇది కొనసాగుతుంది. ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది.
– సుశీంధర్‌రావు, జిల్లా విద్యాధికారి

● భవానీ మాత సన్నిధిలో..



రెండు రోజుల మహారాష్ట్ర పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం తుల్జా భవానీ మాత సన్నిధిలో పూజలు నిర్వహించారు. సీఎం వెంట ఉన్న మంత్రి సబితారెడ్డిని ఆలయ అర్చకులు, అధికారులు అమ్మవారి జ్ఞాపికతో సన్మానించారు. – సాక్షి, రంగారెడ్డి జిల్లా

ధరణి మాయం!

- తమ భూమి మరొకరి పేరున నమోదైందని బాధితుడి ఆవేదన
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపణ
- ఉన్నతాధికారులకు నివేదించామన్న తహసీల్దార్



వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు శ్రీధర్

కొత్తూరు: తమకు సంబంధించిన భూమి తమ ప్రమేయం లేకుండానే ధరణిలో మరొకరి పేరున నమోదైందని బాధితుడు వాపోయాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పత్తిపాటి శ్రీధర్ అనే వ్యక్తి తమ సమీప బంధువైన మరొకరితో కలిసి కొత్తూరు మండలం తిమ్మాపూర్ సర్వే నంబర్ 97/ఆలో మూడెకరాల వ్యవసాయ పొలాన్ని (2019లో) కొనుగోలు చేశారు. ఆ తర్వాత ఇందులోని రెండెకరాల పొలంలో వెంచర్ ఏర్పాటు కోసం హెచ్ఎండీఏకు దరఖాస్తు చేసుకున్నారు. రికార్డులు పరిశీలించిన అధికారులు ఎల్పీ నంబర్ సైతం కేటాయించారు. అయితే వీరి స్థలం మరో వ్యక్తి పేరున మారడంతో పాటు పాసు పుస్తకాలు జారీ అయ్యాయి. విషయం తెలిసిన బాధితుడు శ్రీధర్ తహసీల్దార్, కలెక్టర్ కార్యాయలం, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయిందని ఆరోపించాడు. ఈ విషయమై కొత్తూరు తహసీల్దార్ రాములును వివరణ కోరగా.. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ తమ కార్యాలయంలో జరగలేదని తెలిపారు. విషయం తమ దృష్టికి రావడంతో ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



కేశంపేట: పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశమై రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు

- ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- ప్రాణాంతక వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు
- జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రగతి ఫౌండేషన్, సత్య ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేన్సర్, డయాబెటిస్, గుండెపోటు వంటి ప్రాణాంతక వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి, సరైన చికిత్స పొందితే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని తెలిపారు. పేదప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని స్పష్టంచేశారు. సర్కారు ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వెల్లడించారు. ప్రైవేటు హాస్పిటాళ్లకు దీటుగా అధునాతన పరికరాలు ఏర్పాటు చేసి, అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేస్తున్నట్లు వివరించారు. ప్రజారోగ్యం కోసం గ్రామాల్లో ఉచిత శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రొమ్ము, గర్భస్థ, నోటి కేన్సర్ టెస్టులు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ అలోక్, సత్య ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ చతుర్వేది, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, బూర్గుల వైద్యాధికారి డాక్టర్ రాఘవేందర్, వైద్యులు శ్వేత, సింధు, ఎంపీహెచ్‌ఓ శ్రావణ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ విక్టర్, నర్సు సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

కేశంపేట: సమయ పాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ల్యాబ్ టెక్నీషియన్లు నిత్యం ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలని తెలిపారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి, మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు హెల్త్ సూపర్‌వైజర్లు సుందరి, పుష్ప తదితరులు ఉన్నారు.

బక్రీద్‌కు పొట్టేళ్లు సిద్ధం



జల్‌పల్లిలో అమ్మకానికి సిద్ధంగా గొర్రె పొట్టేళ్లు

- కిటకిటలాడుతున్న జల్‌పల్లి మార్కెట్
- రూ.8 వేల నుంచి రూ.30 వేలు పలుకుతున్న జీవాలు
- జోరుగా సాగుతున్న క్రయవిక్రయాలు

పహాడీషరీఫ్: బక్రీద్ సందర్భంగా జల్‌పల్లి మున్సిపాలిటీలో గొర్రె పొట్టేళ్ల విక్రయాలు ఊపందుకున్నాయి. మూడు రోజుల ముందు నుంచే పెద్ద ఎత్తున జీవాలు దిగుమతి అయ్యాయి. గతంలో జియాగూడ, పాతబస్తీకి వెళ్లి కొనుగోలు చేసేవారు. స్థానికంగా ఖాళీ స్థలాలతో పాటు అన్ని వసతులు కల్పించడంతో ఇక్కడే వ్యాపారాలు ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పొట్టేళ్లను తీసుకొస్తున్న రైతులు, పోషకులు జల్‌పల్లి కార్గో రోడ్డులో విక్రయిస్తున్నారు. వాంబే కాలనీ నుంచి మొదలుకొని మంచు టౌన్‌షిప్ చౌరస్తా వరకు విశాలమైన రోడ్డు డివైడర్‌పై క్రయవిక్రయాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పాతబస్తీతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు సైతం ఇక్కడికే వచ్చి కొనుగోళ్లు నిర్వహిస్తున్నారు. పండుగ నేపథ్యంలో సుమారు లక్ష జీవాలకు పైగా విక్రయమవుతాయని అధికారులు చెబుతున్నారు.

ఆకాశాన్నంటిన ధరలు

బక్రీద్ నేపథ్యంలో పొట్టేళ్ల ధరలు ఆకాశన్నంటాయి. చిన్నపాటి జీవాలు సైతం రూ.8 వేలకు తక్కువ పలకడం లేదు. పెద్దవాటిని ఒక్కోటి రూ.20 వేల నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. జల్‌పల్లి కార్గో రోడ్డు, ఎర్రకుంట, షాహిన్‌నగర్, పహాడీషరీఫ్, ఆర్‌సీఐ రూట్లలో ప్రస్తుతం ఎక్కడ చూసినా గొర్ల మందలే కనిపిస్తున్నాయి. తమ బిడ్డకు సమానంగా నిండు ఆరోగ్యంగా (కొమ్ములు, చెవులు సక్రమంగా ఉండటం) ఉన్న జీవాన్ని ఖుర్బానీ ఇచ్చేందుకు ముస్లింలు ఆసక్తి చూపుతున్నారు. నచ్చిన వాటికి ఎంత ధర పెట్టేందుకైనా వెనకాడడం లేదు.

ఈద్గాల వద్ద ఏర్పాట్లు

బక్రీద్‌ను పురస్కరించుకొని వాదే ముస్తఫా, వాదే హదీస్, పహాడీషరీఫ్, కొత్తపేట ఈద్గాల వద్ద మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పరిసరాల్లోని పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు చదును పనులు చేపడుతున్నారు. ఇక్కడ ముస్లింలు పెద్దఎత్తున ప్రార్థనలు నిర్వహిస్తారు. షాహిన్‌నగర్, సాదత్‌నగర్ మర్కజ్‌లో కూడా ప్రార్థనల కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్టమైన భద్రత కల్పిస్తున్నారు.

వ్యర్థాలు కవర్లలోనే వేయాలి



బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ అనంతరం జంతు వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా మున్సిపాలిటీ తరఫున పెద్ద కవర్లు పంపిణీ చేస్తున్నాం. బస్తీల్లోని వ్యర్థాలను తరలించడానికి టిప్పర్లు, ట్రాక్టర్లు సిద్ధంగా ఉంటాయి. అన్ని వార్డుల్లో చెత్త సేకరణ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నాం.
– వసంత, మున్సిపల్ కమిషనర్, జల్‌పల్లి

సదుపాయాలు బాగున్నాయి



కార్గో రోడ్డుకు జీవాలను తీసుకొచ్చిన రైతులకు ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ తరఫున లైటింగ్, నీటి సదుపాయం కల్పించడం సంతోషకరం. రెండేళ్ల నుంచి జీవాలను ఇక్కడికి తీసుకొస్తుండడంతో రూ.2 లక్షల నుంచి తైబజార్ ఆదాయం కూడా రూ.9 లక్షలకు చేరింది.
– మన్సూర్ అలీ, తైబజార్ నిర్వాహకుడు

బల్కంపేట ఎల్లమ్మకు బంగారు బోనం

చార్మినార్: పోతరాజుల నృత్యాలు.. కళాకారుల ప్రదర్శనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. పాతబస్తీ భక్తులు బల్కంపేట ఎల్లమ్మకు భక్తి శ్రద్ధలతో బంగారు బోనం, పట్టు వస్త్రాలను సమర్పించారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో మొదటి బోనాన్ని ఈ నెల 22న గోల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బంగారు బోనాన్ని మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. గౌలిపురా దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అంగరంగ సామూహిక ఊరేగింపు బయలుదేరి బల్కంపేటకు వెళ్లింది. అమ్మవారికి నైవేద్యంతో కూడిన బంగారు పాత్రను జోగిని నిషా క్రాంతి తలపై పెట్టుకుని చేతుల్లో వీర గోలాలు పట్టుకుని దారిపొడవునా నృత్యాలు చేస్తూ భక్తులను ఉత్సాహపర్చారు. భక్తులు నీళ్లతో సాక పోసి స్వాగతం పలికారు. కాగా.. మూడో బంగారు బోనాన్ని ఈ 30న జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి సమర్పించనున్నారు.



కడ్తాల్ అభివృద్ధికి 'మాస్టర్ ప్లాన్'

- ఇండికేటివ్ ల్యాండ్ యూస్ ముసాయిదాపై చర్చ
- గ్రామ సమగ్ర వివరాలు సేకరిస్తున్నామని వెల్లడి



గ్రామ పంచాయతీ కార్యాలయంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

కడ్తాల్: కడ్తాల్ రెవెన్యూ గ్రామంతో పాటు మండల కేంద్రం సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు హైదరాబాద్ రీజియన్ పట్టణాభివృద్ధి శాఖ(ఆర్‌డీడీటీపీ) అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ సత్యభామ, డీటీసీపీ టీపీవో సువర్ణ, టౌన్‌ప్లానింగ్ అధికారి(టీపీఏ) భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు కడ్తాల్‌లో పర్యటించారు. ఎంపీవో మధుసూదనాచారి, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. కడ్తాల్ అభివృద్ధికి ఇండికేటీవ్ ల్యాండ్ యూస్ ప్లాన్ పేరుతో ముసాయిదా రూపొందించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై చర్చించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న లేఅవుట్ల వివరాలు, ప్రముఖ కట్టడాలు, స్థలాలు, రహదారులు, నక్షదారులు తదితర పూర్తి డేటాను సేకరిస్తున్నామన్నారు. చెరువులు, కుంటలు, రహదారులు, ప్రభుత్వ భూములను పరిశీలించి, వాటి సమగ్ర సమచారం తీసుకుంటామని స్పష్టంచేశారు. జాతీయ రహదారికి ఇరువైపులా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు, రహదారులతో పాటు, ట్రాఫిక్‌కు అనుగుణంగా నివాస, వాణిజ్య, ఇండస్ట్రియల్, పబ్లిక్, అగ్రికల్చర్ సెక్టార్లను గుర్తించి.. ప్రజల ఉపయోగార్థం ఐఎల్‌యూపీ (ఇండికేటివ్ లాండ్ యూస్ ప్లాన్), మాస్టర్ ప్లాన్ ద్వారా అందుబాటులో పెడతామన్నారు. ప్రార్థన మందిరాలు, ప్రభుత్వ కార్యాలయాలను ఇందులో పొందుపరుస్తామని వెల్లడించారు. పూర్వపు కడ్తాల్ గ్రామ పంచాయతీని కలిపి, ముసాయిదా సిద్ధం చేసి అభివృద్ధి ప్రతిపాదనలు రూపొందిస్తామని వివరించారు. సమావేశంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, కార్యదర్శులు ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రూ.4.22 లక్షల నగదు,
15 సెల్‌ఫోన్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

మొయినాబాద్‌: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 14 మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేశారు. ఈ ఘటన మండలంలోని సురంగల్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. సురంగల్‌లోని హనీఫ్‌ ఫాంహౌస్‌లో సోమవారం రాత్రి కొంత మంది పేకాట ఆడుతున్నట్లు ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో, స్థానిక పోలీసులతో కలిసి ఎస్‌ఓటీ పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేశారు. పేకాట ఆడుతున్న నిందితులు శ్రీనివాస్‌, డెక్కని శ్రీనివాస్‌, నాగశ్రీను, సతీష్‌, వనపు శ్రీనివాస్‌, నాగరాజు, అంకంరావు, వెంకటయ్య, శ్రీకాంత్‌, మాలాద్రి, కుంబరాజు, ప్రసన్నకుమార్‌, సురేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4,22,180 నగదు, 15 సెల్‌ఫోన్లు, 16 సెట్ల కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతను అలవర్చుకోవాలి



బహుమతులు పొందిన విద్యార్థులతో బ్యాంకు అధికారులు, ఉపాధ్యాయులు

ఆమనగల్లు: విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతను అలవర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ వికాస బ్యాంక్‌ ఆమనగల్లు శాఖ మేనేజర్‌ శాలి పహిల్వాన్‌ సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో ఏపీజీవీబీ సమక్షంలో ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్‌ పోటీలను నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మేనేజర్‌ నగదు బహుమతులను అందించారు. క్విజ్‌ పోటీల్లో మొదటి బహుమతి సత్య, వైష్ణవి (జెడ్పీహెచ్‌ఎస్‌ ఇర్విన్‌), రెండవ బహుమతి కావేరి, స్వాతి (జెడ్పీహెచ్‌ఎస్‌, ముద్వీన్‌), తృతీయ బహుమతి పవన్‌ కల్యాణ్‌, చరణ్‌(జెడ్పీహెచ్‌ఎస్‌, ఆమనగల్లు) గెలుచుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామస్వామి, సుశీల, చంద్రమోహన్‌, మహేశ్‌, ఫీల్డ్‌ ఆఫీసర్‌ జగన్‌ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: రిజర్వ్‌ బ్యాంకు ఆఫ్‌ ఇండియా ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత క్విజ్‌ పోటీలో గున్‌గల్‌ మోడల్‌ స్కూల్‌ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో నిలవగా బొంగులూర్‌ మోడల్‌స్కూల్‌ తృతీయ స్థానంలో నిలిచింది. యాచారం, ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల నుంచి మొత్తం 22 టీంలు ఈ పోటీలకు హాజరయ్యాయి. ఈ కార్యక్రమానికి నోడల్‌ అధికారిగా డేవిడ్‌ రాజుతోపాటు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్‌ వ్యవహరించారు. విజేతలకు నగదుతో పాటు సర్టిఫికెట్లను అందజేశారు.

చెత్త ట్రాక్టర్‌ బోల్తా

కార్మికులకు స్వల్ప గాయాలు



ఆర్‌సీఐ రహదారిపై బోల్తాపడ్డ ట్రాక్టర్‌

మీర్‌పేట: చెత్త ట్రాక్టర్‌ బోల్తా పడి ఇద్దరు కార్మికులకు స్వల్ప గాయాలైన ఘటన మీర్‌పేటలో చోటు చేసుకుంది. మంగళవారం జిల్లెలగూడ బీజేపీ క్వార్టర్స్‌ వద్ద చెత్తను సేకరించేందుకు పారిశుద్ధ్య సిబ్బంది ట్రాక్టర్‌పై వెళ్తుండగా ఆర్‌సీఐ రహదారిపై ట్రాక్టర్‌ ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న కార్మికులు ఇస్తారి, అంజయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే శానిటరీ సూపర్‌వైజర్లు ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న కమిషనర్‌ నాగేశ్వర్‌ ఆస్పత్రికి వెళ్లి కార్మికులను పరామర్శించారు. కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయని, చికిత్స అనంతరం వారిని ఇంటికి పంపించామని కమిషనర్‌ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు అదృశ్యం



వడ్డె సోనీ



చాకలి శ్రీనయ్య

చేవెళ్ల: వేర్వేరు ఘటనల్లో మహిళ, ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చేవెళ్ల గ్రామానికి చెందిన వడ్డె రవి భార్య వడ్డె సోనీ(23) ఈనెల 25న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. భర్త చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికిన భార్య ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుమ్మెరలో...

మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన చాకలి శ్రీనయ్య(38) గొడవ పడి వారం రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అతని కోసం భార్య మాధవి, కుటుంబసభ్యులు ఎంత వెతికిని ఎక్కడ అతని ఆచూకీ లభించలేదు. భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అధ్యాపకుడు అదృశ్యం

కందుకూరు: ఒడిశాకు చెందిన అధ్యాపకుడు అదృశ్యమయ్యాడు. బంధువుల తెలిపిన వివరాల ప్రకారం.. ఆబోటో డిగల్‌ (30) కల్వకుర్తిలో అద్దెకు ఉంటున్నాడు. ఈ నెల 20న కందుకూరు మండల కేంద్రంలోని నోబెల్‌ కళాశాలలో ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు పాఠాలు చెప్పడానికి వచ్చి అదృశ్యమయ్యాడు. డిగల్‌ ఆచూకీ కోసం బంధువులు ఎంత వెతికినా దొరకడం లేదు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సీపీజీఈటీ-2023లో భాగంగా (సీపీజీ ప్రవేశ పరీక్షలు) ఓయూ పరిధిలో జరగాల్సిన వివిధ డిగ్రీ కోర్సుల పరీక్షలను వాయిదా వేశారు. వాయిదాపడిన డిగ్రీ కోర్సుల సెమిస్టర్‌ పరీక్షల వివరాలను ఉస్మానియా.ఏసీ.ఇన్‌ వెబ్‌సైట్లో చూడవచ్చు.

మళ్లీ ముంపు ముప్పు తప్పదా?

- చెరువులు, కుంటలకు మరమ్మతులేవి?
- ఆందోళనలో ముంపు ప్రాంత ప్రజలు
- ఇరిగేషన్‌ శాఖ తీరుపై మండిపాటు



రెడ్డికుంట చెరువు కట్టకు అడ్డుగా వేసిన మట్టిబస్తాలు

అబ్దుల్లాపూర్‌మెట్‌: వానాకాలం వచ్చిందంటే చాలు ముంపు గ్రామాల ప్రజలు హడలెత్తిపోతున్నారు. మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న చెరువులు, కుంటలు, కాల్వలకు నేటికీ మరమ్మతులు చేయకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ భారీ వర్షాలు కురిస్తే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరించడంలో నీటిపారుదల శాఖ పూర్తిగా వైఫల్యం చెందిందన్న విమర్శలు వస్తున్నాయి. వానాకాలం ప్రారంభమైనా కనీస చర్యలు చేపట్టకపోవడం దారుణమని ముంపు ప్రజలు వాపోతున్నారు. గండ్లు పడిన సమయంలో తాత్కాలిక చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం కేంద్రంలోని రెడ్డికుంట చెరువు, పెద్దఅంబర్‌పేట ఈదులచెరువు, గుంతపల్లి చెరువు, బాటసింగారం బాతుకలచెరువు, కొత్తగూడెం చెరువు, లష్కర్‌గూడ కత్వలు మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా గండ్లు పడటంతో అప్పట్లో నామమాత్రం చర్యలు చేపట్టారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందో తెలియని పరిస్థితి నెలకొని ఉంది. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని రెడ్డికుంట చెరువు కట్ట పూర్తిగా తెగిపోవడంతో కేవలం మట్టిబస్తాలతో అడ్డుకట్ట వేశారే తప్ప శాశ్వత చర్యలు చేపట్టకపోవడంతో ఇరిగేషన్‌ అధికారులు తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కల్గడానికి ఈ చెరువు కట్ట తెగిపోవడంతోనే ఒక్కసారిగా నీరు రోడ్డుపై వచ్చి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురైన విషయం అందరికీ తెలిసిందే. వర్షాకాలం ఆరంభమైన వేళ ఎక్కువ ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటలపై ఇరిగేషన్‌ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి భారీ నష్టాలు జరగకముందే శాశ్వత మరమ్మతులు చేసి తమకు మేలు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

రెడ్డికుంట చెరువు కట్టతో పాటు ఇతర చెరువుల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు, నిధులు మంజూరైన వెంటనే టెండర్లను పిలిచి మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– గంగ ఏఈ ఇరిగేషన్‌, అబ్దుల్లాపూర్‌మెట్‌

ఐసీడీఎస్‌కు బడ్జెట్‌ పెంచాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న డిమాండ్‌



ఐసీడీఎస్‌ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: ఐసీడీఎస్‌కు బడ్జెట్‌ను పెంచాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న డిమాండ్‌ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 16న ఆదిలాబాద్‌ జిల్లాలో ప్రారంభమైన అంగన్‌వాడి ఉద్యోగుల జీపుజాత 30న మహేశ్వరంలో ముగుస్తుందని, ఈ కార్యక్రమానికి అంగన్‌వాడి సిబ్బంది వెళ్లేందుకు అనుమతిని ఇవ్వాలని మంగళవారం ఇబ్రహీంపట్నంలోని ఐసీడీఎస్‌ కార్యాలయ అధికారికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం చట్టాన్ని రద్దు చేయాలని, అంగన్‌వాడి ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పెన్షన్‌, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌ చేశారు. అంగన్‌వాడి ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని విమర్శించారు. అంగన్‌వాడి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎల్లేష్‌, పోచమోని కృష్ణ, అంగన్‌వాడి టీచర్స్‌ బాలమణి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో జాతీయ సదస్సు ప్రారంభం



మాట్లాడుతున్న సదస్సు కన్వీనర్‌ ప్రొ.శంకర్‌

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌ బీఈడీ కాలేజీలో రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. మంగళవారం కళాశాల బ్లాక్‌-సి కాన్ఫరెన్స్‌ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి సదస్సు కన్వీనర్‌ డాక్టర్‌. పారిపల్లి శంకర్‌ అధ్యక్షత వహించగా ఓయూ రిజిస్ట్రార్‌ ప్రొ.లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం అమలవుతున్న విద్యా విధానాన్ని సమీక్షించి విద్య పట్ల మన దృక్పథాన్ని మార్చుకోవాన్నారు. కార్యక్రమంలో హెడ్‌ ప్రొ.రామకృష్ణ, డీన్‌ ప్రొ. రాజేష్‌కుమార్‌, ఐసీఎస్‌ఎస్‌ఆర్‌ డైరెక్టర్‌ ప్రొ.సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పశువైద్యం దైవాదీనం

- సిబ్బంది లేక కేంద్రాల మూత
- ఇబ్బందుల్లో పాడిరైతులు



ఉత్తరాసిపల్లిలో మూతపడ్డ పశు వైద్య ఉపకేంద్రం

జిల్లాలో పశువుల వివరాలు..

గోజాతి	240826
గేదెజాతి	167018
గొర్రెలు	767125
మేకలు	256632
మొత్తం:	1023757

పశువైద్య కేంద్రాల వివరాలు..

ప్రాంతీయ పశు వైద్యశాలలు	4
మండల పశు వైద్యశాలలు	46
గ్రామీణ పశు వైద్యశాలలు	87
సంచార వైద్య వాహనాలు	4
గోపాల మిత్రలు 28 మంది	

కొందుర్గు: రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం చేపడుతున్నారు. కానీ, పాడి పశువులకు ఏమైనా రోగాలు వస్తే నయం చేయడానికి వైద్యులు లేక పశువైద్య కేంద్రాలు మూతపడుతున్నాయి. దీంతో రైతన్నలు పశువులకు వైద్య పరీక్షలు చేయించడానికి ఎన్నో అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలోని రైతన్నలు వ్యవసాయంతో పాటు పశుపోషణ ప్రధాన వృత్తిగా చేసుకొని జీవనం సాగిస్తున్నారు.

సిబ్బంది లేక మూతపడుతున్న కేంద్రాలు..

జిల్లాలో పశు వైద్యశాలల్లో సేవలందించడానికి సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల ఇబ్బందిగా మారింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించడానికి 53 మంది పశుగణ సహాయకులు ఉండాల్సిండగా కేవలం 17 మంది మాత్రమే ఉన్నారు. జూనియర్‌ వెటర్నరీ ఆఫీసర్లు 31 మందికి 30 మంది ఉండగా, వీఎల్‌ఓలు 16 మందికి 15 మంది, డాక్టర్లు 46 మందికి గాను 43 మంది, వెటర్నరీ అసిస్టెంట్లు 36 మందికి 36 మంది సేవలందిస్తున్నారు. ఇక 72 మంది అటెండర్లు ఉండాల్సి ఉండగా కేవలం 32 మంది మాత్రమే ఉన్నారు. దీంతో సిబ్బంది లేక పలు పశువైద్యశాలలు మూతపడుతున్నాయి. చేవెళ్ల ఏరియాలో ఆలూరు, షాద్‌నగర్‌లో చౌదరిగూడ, కల్వకుర్తిలో కడ్తాల మండల పశు వైద్యశాలల్లో డాక్టర్లు లేక అటెండర్లు, పశుగణ సహాయకులు సేవలందిస్తున్నారు. కొందుర్గు మండలం ఉత్తరాసిపల్లి, జిల్లేడ్‌ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల పశువైద్య ఉప కేంద్రాలు సిబ్బంది లేకపోవడంతో మూతపడ్డాయి. దీంతో ఆయా ప్రాంతాల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

కేంద్రాలు మూసివేస్తే ఎలా..?

గ్రామీణ ప్రాంతాల్లోనే అధికంగా రైతులు ఉంటారు. ఇక్కడి రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ ప్రధాన వృత్తిగా నమ్ముకొని జీవిస్తున్నారు. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పశు వైద్య కేంద్రాలను సిబ్బంది లేని కారణంగా మూసివేస్తే రైతులు ఏమి చేయాలి. ఉత్తరాసిపల్లి పశువైద్య ఉప కేంద్రం గత ఐదేళ్లుగా తెరవడం లేదు.

– జంగయ్య, సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సిబ్బంది కొరత వల్లే



సిబ్బంది కొరత వల్ల కొన్ని కేంద్రాలు సరిగ్గా తెరవడం లేదు. అయినప్పటికీ పక్క కేంద్రాల్లో పనిచేసే సిబ్బందిని వారానికి ఒకటి, రెండు రోజులు పంపిస్తున్నాం. పూర్తిస్థాయి సిబ్బంది విధుల్లో చేరే వరకు ఇబ్బందులు తప్పవు. ఏమైనా అత్యవసరం అయితే సంచార పశువైద్య అంబులెన్స్‌కు కాల్‌ చేయాలి.

– డాక్టర్‌ అంజిలప్ప, జిల్లా పశు వైద్యాధికారి, రంగారెడ్డి

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- జులై 1న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముట్టడి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య

కాచిగూడ: రాష్ట్ర వ్యాప్తంగా 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.5వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి అధ్యక్షతన మంగళవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెంచాలని, ఫీజుల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్‌ చేస్తూ జులై 1న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్‌ కార్యాలయాలు, ఆర్‌డీఓ, తహసీల్దార్‌ కార్యాలయాల ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులు తరగతులు బహిష్కరించి శాంతియుతంగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు బడ్జెట్‌ కేటాయింపులో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. రెండేళ్లుగా ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయని, దీంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి బీసీ విద్యార్థికి సంవత్సరానికి రూ.20వేలు స్కాలర్‌షిప్‌ ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. విదేశీ విద్యకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ స్టైఫండ్‌ ఇవ్వాలన్నారు. బీసీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రెటరీని బదిలీ చేయాలని డిమాండ్‌ చేశారు. బీసీల జనాభా ప్రకారం అదనంగా మరో 120 బీసీ గురుకుల పాఠశాలలు, 50 డిగ్రీ కాలేజీలు మంజూరు చేయాలన్నారు. కొత్తగా 300 కాలేజీ హాస్టళ్లు ప్రారంభించాలన్నారు. బీసీ కాలేజీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌ బడ్జెట్‌ను రూ.200 కోట్లకు పెంచాలని, రూ.20 వేల కోట్లతో బీసీ సబ్‌ ప్లాన్‌ ఏర్పాటు చేయాలన్నారు. జూనియర్‌ అడ్వకేట్లకు ఇచ్చే స్టైఫండ్‌ రూ.10,000కు పెంచాలన్నారు. కార్యక్రమంలో సంఘం జాతీయ కన్వీనర్‌ గుజ్జ కృష్ణ, వేముల రామకృష్ణ, నీల వెంకటేష్‌, జి.కృష్ణయాదవ్‌, కె.నర్సింహగౌడ్‌, సతీష్‌, నందగోపాల్‌, రాజ్‌కుమార్‌, భాస్కర్‌, వెంకట్‌, నిఖిల్‌ పటేల్‌ పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్‌లో దూకి యువకుడి మృతి

పహాడీషరీఫ్‌: స్విమ్మింగ్‌ పూల్‌లో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌ కథనం ప్రకారం.. బహదూర్‌పురా ఉస్మాన్‌పురాకు చెందిన ఆటో డ్రైవర్‌ మహ్మద్‌ నియాజ్‌ (23) తరచూ మద్యం సేవిస్తుండటంతో మూడు నెలల క్రితం తల్లి మందలించింది. అప్పటి నుంచి ఇంటికి వెళ్లడం మానేశాడు. హాజిరాబేగంను వివాహం చేసుకొని అద్దె ఇంటి కోసం స్నేహితులతో కలిసి వెతుకులాటలో ఉన్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు అతీక్‌ తండ్రి వాచ్‌మెన్‌గా పనిచేసే జల్‌పల్లి కమాన్‌ రోడ్డులోని అక్తర్‌ హుస్సేన్‌ ఫాంహౌజ్‌కు సోమవారం సాయంత్రం భార్య, స్నేహితులు అఫ్జల్‌, అతీక్‌లతో కలిసి వెళ్లాడు. కాసేపయ్యాక హాజిరాబేగం వాచ్‌మెన్‌ గది వద్ద ఉండగా.. ఇద్దరు స్నేహితులు ఫాంహౌజ్‌లో తిరుగుతున్నారు. నియాజ్‌ ఫాంహౌజ్‌లో ఉన్న స్విమ్మింగ్‌ పూల్‌లోకి దూకాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతుడి సోదరుడు అర్బాజ్‌ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.